సాక్షి ఖమ్మం

శనివారం । 13 । జూలై । 2024



భళా.. విత్తనాభివృద్ధి సంస్థ

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వరితో పాటు అపరాలు, పచ్చిరొట్ట విత్తనాల అమ్మకాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తోంది.

8లో



చెరువులను మింగేస్తున్నారు..

సత్తుపల్లి మండలంలోని పలు చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురవుతుండగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
$30^o / 25^o$

వాతావరణం

జిల్లా అంతటా శనివారం తక్కువ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కార్గో ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవల విస్తరణ కోసం కొత్త ఏజెన్సీలను ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్, ఖమ్మం జిల్లాల ఏటీఎం టి.పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఏజెన్సీల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మెషిన్ ఉన్న వారు పూర్తి వివరాల కోసం 91542 98582, 91542 98585 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంమయూరిసెంటర్: యూపీఎస్సీ నిర్వహించనున్న ప్రిలిమ్స్, మెయిన్స్‌కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ అభ్యర్థులకు హైదరాబాద్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారాఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు శిక్షణ కోసం దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి సమాచారం కోసం 040–23546552, 81216 26423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరికి కారుణ్య నియామకపత్రాలు



నియామకపత్రాలు అందిస్తున్న చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మంవన్‌టౌన్: కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన ఇద్దరికి శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎం.లావణ్య, ఎస్.కే.మదార్‌కు పెనుబల్లి, ముదిగొండ ఎంపీపీ కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్‌గా పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. జెడ్పీ సీఈఓ వినోద్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైనంపల్లి టోల్‌ప్లాజా సిద్ధం



నిర్మాణం పూర్తయిన టోల్‌ప్లాజా

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి వద్ద టోల్ ప్లాజా ప్రారంభానికి సిద్ధమైంది. కోదాడ–కురవి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా నిర్మించారు. ఇక్కడ గేట్లు, కేబిన్లు సహా అంతా సిద్ధం చేయగా, రెండు వైపులా బోర్లు సైతం ఏర్పాటుచేసి ట్రయల్ రన్ చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న నేపథ్యాన త్వరలోనే టోల్‌ప్లాజా వద్ద వసూళ్లు మొదలుకానున్నాయని తెలుస్తోంది.

'ఇంటింటా ఇన్నోవేటర్' పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఇంటింటా ఇన్నోవేటర్ పాల్గొనే వారు వచ్చే నెల 3వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు తమ ప్రతిభ చాటేందుదుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందన్నారు. ఈమేరకు తమ ఆవిష్కరణకు సంబంధించి నాలుగు చిత్రాలు (హైరిజల్యూషన్), వాటి పనితీరుతో రెండు వీడియోలు, 100 పదాలతో వివరణ, పేరు, ఫోన్ నంబర్, వయస్సు, వృత్తి, చిరునామా వివరాలను 91006 78543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా కోఆర్డినేటర్ జి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ ఫీవర్రీ

ఈ ఏడాది సీజనల్ వ్యాధుల బెడద మొదలైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పల్లె, పట్నం తేడా లేకుండా పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. తద్వారా దోమల వ్యాప్తి పెరగడంతో వైరల్ ఫీవర్ల బారిన పడే వారి సంఖ్య ఎక్కువవుతోంది. కాగా, వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తూ వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టినా పారిశుద్ధ్య సమస్య కారణంగా ఫలితం ఉండడం లేదని చెబుతున్నారు. దీంతో జిల్లా జనరల్ ఆస్పత్రితో పాటు వివిధ పీహెచ్‌సీలకు తాకిడి పెరిగింది. ఈమేరకు ప్రజలు అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకతపై వైద్యులు సూచనలు చేస్తున్నారు.

– ఖమ్మంవైద్యవిభాగం

జిల్లాలో వ్యాపిస్తున్న వ్యాధులు

- ఇప్పటికే 200కు పైగా డెంగీ కేసుల నమోదు
- ఆపై వైరల్ ఫీవర్ భయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఖమ్మం పెద్దాస్పత్రిలో ఓపీ విభాగం వద్ద బారులుదీరిన ప్రజలు



మందులు ఇచ్చే కౌంటర్ వద్ద క్యూ

జిల్లాలో గత కొన్నేళ్లుగా నమోదైన వ్యాధుల వివరాలు

	2021	2022	2023	2024 (ఇప్పటివరకు)
డెంగీ	944	711	530	200
టైఫాయిడ్	--	--	243	04
వైరల్ ఫీవర్	--	--	42,035	22,367

డెంగీ.. డబుల్ సెంచరీ

జిల్లాలో జనరల్ ఆస్పత్రితో పాటు రెండు ఏరియా ఆస్పత్రులు, నాలుగు సీహెచ్‌సీలు, 26 పీహెచ్‌సీలు, 224 సబ్ సెంటర్లు, 161 పల్లెదవాఖానాలు ఉన్నాయి. వీటన్నింట్లో కలిపి ఇప్పటివరకు 200 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. అయితే, ప్రైవేట్ ఆస్పత్రుల లెక్కలు కూడా తేలితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. మరోపక్క డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్స్ కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు ప్రణాళికలతో ముందుకెళ్తోంది. దీంతో నామమాత్రంగానే వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మినహా మిగతా ఆస్పత్రులకు వైరల్ ఫీవర్‌తో వస్తున్న వారి సంఖ్య తక్కువేనని తెలుస్తోంది. కాగా, సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య, ఆరోగ్య శాఖ ర్యాపిడ్ యాక్షన్ టీంలను సిద్ధం చేసింది. ఎక్కడైనా కేసులు నమోదయితే అప్రమత్తమై ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తోంది.

అప్రమత్తతే ఆయుధం

ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే సీజనల్ వ్యాధులు విరుచుకుపడే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఏటా డెంగీ కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందిన డెంగీ వ్యాప్తికి కారణమవుతాయని సూచిస్తున్నారు. ఈనేపథ్యాన పూలకుండీలు, రోళ్లు, టైర్లు, కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడమే కాక కిటికీలు, తలుపులకు మెష్‌లు ఏర్పాటుచేసుకోవాలని... జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలని చెబుతున్నారు.

వ్యాధుల కట్టడికి కార్యాచరణ



జిల్లాలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి పీహెచ్‌సీల పరిధిలో ర్యాపిడ్ యాక్షన్ టీంలు, అంటు వ్యాధి బృందాలను నియమించాం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధుల చికిత్స కోసం ప్రత్యేక వార్డులను సిద్ధం చేశాం. దోమలు వృద్ధి చెందకుండా డ్రెయినేజీల్లో వేయడానికి గంబూషియా చేపలు, ఆయిల్‌బాల్స్ సిద్ధం చేశాం.టెమోఫాస్, ఇతర ద్రావణాలను పిచికారీ చేయిస్తున్నాం. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంతో పాటు రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని పంచాయితీ అధికారులను కోరాం. ప్రజలు సైతం దోమల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ బి.మాలతి, డీఎంహెచ్‌ఓ

గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్
- జిల్లాలో పర్యటన, కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

ఖమ్మం సహకారనగర్: గిరిజనుల సంక్షేమం కోసమే జాతీయ స్థాయిలో ఎస్టీ కమిషన్ పని చేస్తోందని కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులంతా కృషి చేయాలని సూచించారు. గిరిజన హాస్టళ్లను గురుకులాలుగా మార్చి సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులు అడిగిన చోట ఖాళీలతో సంబంధం లేకుండా సీట్లు కేటాయించాలన్నారు. ఆతర్వాత ట్రైకార్ లబ్ధిదారుల ఎంపిక, పోడు పట్టాల పంపిణీ, అంగన్‌వాడీల్లో వసతుల కల్పన, గిరి వికాసం పథకాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆర్‌ఓఎఫ్ఆర్ కింద 2022లో దరఖాస్తులు స్వీకరించి 6,589 మందికి 13 వేల ఎకరాల మేర భూమికి పట్టాలు ఇచ్చామని తెలిపారు. గిరివికాసం క్రింద 318 బోర్లు, అవసరమైన చోట్ల విద్యుత్ లైన్లు మంజూరు చేశామన్నారు. పోలీస్ శాఖ ద్వారా 11 అట్రాసిటీ కేసులు నమోదు కాగా ఆరు కేసుల విచారణ పూర్తయిందని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, డీఆర్వో రాజేశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, జిల్లా అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో రత్నాలు

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో రత్నాల వంటి వారున్నారని, పలువురు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరతారని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, రఘునాథపాలెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభా గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే వృద్ధిలోకి వస్తారని తెలిపారు. ఆతర్వాత పాఠశాలల్లో సౌకర్యాలపై ఆరాతీసిన ఆయన డార్మిటరీ గదుల నిర్మాణం, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. గిరిజన సంక్షేమ డీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు శంకర్‌రావు, రమాకుమారి, బాలస్వామి, జహీరుద్దీన్, జి.రాము, రూపాదేవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ధరణి'లో లోపాలతో సమస్యలు

ఖమ్మం మామిళ్లగూడెం: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఎక్కువగా భూసంబంధమైనవే ఉన్నాయని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ తెలిపారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధరణి సైట్‌తో పాటు రెవెన్యూ వ్యవస్థలో లోపాలతో సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. కాగా, పరీక్ష నిర్వహించి గురుకులాల్లో సీట్లు ఇవ్వడం సరికాదన్నారు. గిరిజనులు తమ సమస్యలపై ఢిల్లీ రావాల్సిన అవసరం లేదని, హైదరాబాద్‌లోనూ ఎస్టీ కమిషన్ కార్యాలయం ఏర్పాటుచేశామని తెలిపారు. ఇక ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, ఆదివాసీ పేర్లతో వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు కేటాయించిన నిధులను ఐటీడీఏ ద్వారా కాక నేరుగా ఖర్చు చేసిన అంశంపై నివేదిక కోరామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు శ్యాంరాథోడ్, చావా కిరణ్, రవిరాథోడ్, డీకొండ శ్యాం, శ్రీనివాస్, ఎం.డీ.పాషా, సరస్వతి, దొడ్డా అరుణ, నెల్లూరి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్య బాధ్యతల స్వీకరణ

హాజరైన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు

భద్రాచలంటౌన్: మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరగ్గా, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. భద్రాచలం రామాలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి పొదెంకు ఆశీర్వచనాలు అందజేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వీరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌టీసీ ఎండీ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, టూరిజం ఈడీ రంజిత్ నాయక్, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వీరయ్య

జిల్లావ్యాప్తంగా వర్షం

పంటలకు ప్రయోజనంగా వాన


ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం నుంచే ఆకాశం మేఘావృతం కాగా, రాత్రి ఏడు గంటల తర్వాత మొదలైన ఎనిమిది గంటల వరకు కొనసాగింది. ఈమేరకు పెనుబల్లి మండల కేంద్రంలో అత్యధికంగా 19.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, ఏన్కూరులో 11.5, ముదిగొండలో 11.3, కామేపల్లి మండలం లింగాలలో 9.3, తల్లాడలో 9, సత్తుపల్లిలో 6.8, తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో 6.5, బచ్చోడులో 6, కొణిజర్ల మండల కేంద్రంలో 5.3, గేటు కారేపల్లిలో 5 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.ఇక ఖమ్మం ప్రకాష్‌నగర్, ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం, నేలకొండపల్లి, వైరా, వేంసూరు, బాణాపురంల్లోనూ వర్షప్రభావం కనిపించింది. ఈవర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిండి రహదారులపైకి వరద చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కాగా, ప్రస్తుతం కురుస్తున్న వానలు సాగులో ఉన్న, సాగు చేయనున్న పైర్లకు ప్రయోజనకరంగా మారుతున్నాయి. ప్రధానంగా పత్తి, అపరాల పంటలైన పెసర, కంది పంటలకు వానలు ఉపకరిస్తాయని చెబుతున్నారు. అంతేకాక వరి, మిర్చి పంటల సాగు సైతం జోరందుకోనుంది.

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్ తదితర ప్రాంతాల్లో కొద్దిరోజులుగా గాలి వచ్చినా, వర్షం జల్లు పడినా సరఫరా నిలిచిపోతుండడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం రాత్రి మూడు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. గతంలో రోటరీనగర్ సబ్‌స్టేషన్, మమత సబ్‌స్టేషన్ నుండి సరఫరా చేసినప్పుడు ఇబ్బంది లేదని, టేకులపల్లి సబ్‌స్టేషన్ నుండి సరఫరా మొదలుపెట్టిన నాటి నుంచి సమస్య పెరిగిందని స్థానికులు వాపోతున్నారు.

ఆమె.. ఇంకో అడుగు!

- మహిళల నేతృత్వాన 'ఇందిర' క్యాంటీన్లు
- జిల్లాలో తొలిదశగా మూడు ప్రాంతాల గుర్తింపు
- తక్కువ ధర, నాణ్యమైన ఆహారం అందించేలా నిర్వహణ
- ఆసక్తి ఉన్న వారికి మాస్టర్ చెఫ్‌ల ద్వారా శిక్షణ



ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోంది. మహిళా సంఘాల సభ్యులుగా నగదు పొదుపు చేస్తూ, బ్యాంక్ రుణాల ద్వారా ఇప్పటికే వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలను మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇంకో పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రదేశాల్లో మహిళల నేతృత్వాన క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయించింది. 'ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు' పేరుతో వీటిని ఏర్పాటు చేయనుండగా, ఇప్పటికే జిల్లాలో అనువైన ప్రాంతాల గుర్తింపు మొదలుపెట్టారు. తొలిదశలో ప్రయోగాత్మకంగా మూడు చోట్ల క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఎస్‌హెచ్‌జీలతో నిర్వహణ

ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలు చేస్తున్న ప్రభుత్వం వారిని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని భావించింది. క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) సభ్యులైన మహిళలకే అప్పగించనున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం పరిశీలిస్తోంది. ఇందుకోసం రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకోవడంతో పాటు తిరిగి సక్రమంగా చెల్లిస్తున్న మహిళా సంఘాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. బ్యాంకర్లతో సమీక్షించాక సంఘాలను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

రుణాలతో పాటు శిక్షణ

జిల్లాలో క్యాంటీన్ల ఏర్పాటుకు ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలు ఇప్పిస్తారు. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉండడంతో పాటు వంటలు చేయడంలో అనుభవం, క్యాటరింగ్ నిర్వహణ తదితర అంశాలను ఎంపికకు అర్హతలుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఆపై వారికి హైదరాబాద్‌లో మాస్టర్ చెఫ్ ద్వారా పది రోజుల పాటు క్యాంటీన్ల నిర్వహణ, వంటల తయారీలో శిక్షణ సైతం ఇప్పిస్తారు. ఇప్పటికే పలువురు మహిళా సంఘాల సభ్యులు క్యాటరింగ్ నిర్వహణ, పిండి వంటలు, పచ్చళ్ల తయారీలో రాణిస్తున్నారు. ఇలాంటి వారినే క్యాంటీన్ల నిర్వహణకు ఎంపిక చేసి తక్కువ ధరతో నాణ్యత కలిగిన టిఫిన్, భోజనం అందుబాటులోకి తీసుకురావాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

మూడు ప్రాంతాలు పరిశీలన

మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటుకు జిల్లాలో రద్దీ ప్రాంతాలను అధికారులు గుర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణం, కలెక్టరేట్, ఖమ్మంరూరల్ మండలంలోని రెడ్డిపల్లిలో మారెమ్మ అమ్మవారి గుడి సమీప ప్రాంతాన్ని క్యాంటీన్ల ఏర్పాటుకు పరిశీలించారు.అయితే, ఇప్పటికే కలెక్టరేట్, ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాంటీన్లు కొనసాగుతుండడంతో ఈ అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారు. ఇక మారెమ్మగుడి వద్ద క్యాంటీన్ ఏర్పాటుకు నివేదిక సమర్పించారు. మొదటి దశలో ఈ మూడు చోట్ల ఏర్పాటు చేశాక, ఆ తర్వాత నియోజకవర్గానికొకటి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రద్దీ ప్రాంతాలను పరిశీలిస్తున్నాం..



జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు రద్దీ ఉండే ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రాంతాలు, మండల కేంద్రాల్లోనైతే మూడు ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉంటే అక్కడ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఎంపిక చేసిన సంఘాల్లోని మహిళలకు శిక్షణ ఇవ్వడమే కాక రుణాలు సైతం మంజూరు చేయిస్తాం.

– ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

తెరుచుకున్న విజయ డెయిరీ పార్లర్



విజయ డెయిరీ పార్లర్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్రంలో పది నెలలుగా మూతపడిన ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విజయ డెయిరీ పార్లర్ శుక్రవారం తిరిగి ప్రారంభమైంది. ఖమ్మంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమ వద్ద గత ఐదేళ్ల క్రితం విజయ పాలు, పాల పదార్థాల విక్రయానికి సీహెచ్.స్వాతి పేరిట అనుమతి జారీ చేశారు. అయితే, గత ఏడాది సెప్టెంబర్‌లో గడువు ముగిసినా రెన్యూవల్ కాకపోవడంతో నిర్వాహకులు మూసేశారు. మళ్లీ ఇప్పుడు పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నుంచి అనుమతి తీసుకుని ప్రారంభించారు. ఈ పార్లర్‌లో విజయ పాలు, పెరుగు, స్వీట్ లస్సీ, దూద్ పేడ, మజ్జిగ, పన్నీర్, బాసుంది, ఐస్‌క్రీమ్ తదితర పదార్థాలను విక్రయిస్తున్నారు.

18వరకు 'దోస్త్' సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో 'దోస్త్' సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 18వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవచ్చని కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈమేరకు గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎప్‌సెట్ కౌన్సిలింగ్‌కు 470మంది

ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఖమ్మంలోని ఎస్ ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవా రం 480మందికి గాను 470మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈమేరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ధ్రువపత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, ఎప్‌సెట్ కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.

అల్యూమినియం కండక్టర్ వైరు చోరీ

వైరా: వైరాలోని మార్కెట్ ఎదురుగా గోదాంలో నిల్వ ఉంచిన అల్యూమినియం కండక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. పోలీసుల కథనం మేరకు.. గ్రీన్ ఫీల్డ్ హైవే విద్యుత్ కాంట్రాక్టును సభి ఎంటర్ ప్రైజెస్ బాధ్యులు దక్కించుకున్నారు. ఈ సంస్థ వైరాలోని గోదాం అద్దెకు తీసుకుని విద్యుత్ సామగ్రిని నిల్వచేశారు. గురువారం రాత్రి ఓ వ్యక్తి ట్రాలీ ఆటోతో చేరుకుని గోదాం వెనుక తలుపు తాళాలు పగలగొట్టి సుమారు 250 కిలోల బరువైన ట్రిబుల్ అల్యూమినియం కండక్టర్ వైరు చోరీకి యత్నించాడు. ఈక్రమంలో సమీపాన ఉన్న అయ్యప్ప అనే వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని రూ.58వేల విలువైన వైరుతో సహా పరారయ్యాడు. ఈవిషయమై సైట్ ఇంజనీర్ అజ్మీరా వీరబాబు పోలీసులు ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా, కొన్ని రోజుల క్రితం గోదాం ఆవరణలోని రూ.2.20లక్షల విలువైన 106 ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ బీడు పైపులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిసింది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తులే చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని తిమ్మినేనిపాలెంకు చెందిన చీర్ల వెంకటేశ్వర్లు(48) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆయన గత నెల 28న రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తుండగా అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు ఖమ్మంలో చికిత్స అనంతరం ఈనెల 10న హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భార్య అనసూర్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

దాడి ఘటనపై కేసు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని లక్ష్మీపురం కుటుంబ కలహాల కారణంగా జరిగిన దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. గ్రామానికి చెందిన ధరావత్ కృష్ణ కుటుంబంలో కొన్నాళ్లు గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యాన కృష్ణ, ఆయన భార్యతో సోదరుడు లాలు గొడవ పడి కొట్టాడు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షాకీర్ శుక్రవారం తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	6,700
మిర్చి	16,000	10,000
మిర్చి తాలు	10,300	6,000
ఏసీ మిర్చి	19,300	10,000
ఏసీ తాలు	10,200	9,500
పత్తి	7,300	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

భళా... విత్తనాభివృద్ధి సంస్థ!

ఈ ఏడాది రూ.8.53 కోట్ల మేర వ్యాపారం

- ఉమ్మడి జిల్లాలోని 95 సొసైటీల ద్వారా విక్రయాలు
- సబ్సిడీపై భారీగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- వరి, అపరాల విత్తనాల అమ్మకంలోనూ జోరు



ఖమ్మంలోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రూ.8.53 కోట్ల మేర విత్తన వ్యాపారం చేసి ముందంజలో నిలిచింది. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మంచి స్పందన లభించింది. భూముల్లో సారం పెంచడం, పంటల్లో అధిక దిగుబడి సాధించడం, ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు రైతులు పచ్చిరొట్ట సాగుకు ప్రాధాన్యత ఇస్తారు. ఈమేరకు విత్తనాభివృద్ధి సంస్థ పచ్చిరొట్ట విత్తనాలు భారీగా సమకూర్చడంతో అమ్మకాల్లో గత కొన్నేళ్ల మాదిరిగానే రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అగ్రభాగాన నిలిచింది. ఇక ప్రభుత్వం ఈ ఏడాది సన్న వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు ఆసక్తి చూపుతుండగా విత్తనాభివృద్ధి సంస్థ ఐదు రకాల వరి విత్తనాలను పీఏసీఎస్‌ల ద్వారా విక్రయించింది.

సబ్సిడీపై పచ్చిరొట..

పచ్చిరొట్ట విత్తనాలను 60 శాతం సబ్సిడీపై రైతులకు సంస్థ ద్వారా విక్రయించారు. జీలుగ, జనుము, పిల్లి పెసర పచ్చిరొట్ట విత్తనాలను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి సీజన్‌కు ముందుగానే సహకార సంఘాల ద్వారా అందుబాటులో ఉంచారు. ఉమ్మడి జిల్లాలో రూ.7.83 కోట్ల విలువైన సుమారు 30 వేల క్వింటళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సంస్థ విక్రయించింది. ఇందులో సింహభాగం జీలుగ విత్తనాలే ఉన్నాయి.

రూ.57 లక్షల విలువైన వరి

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత వానాకాలం విత్తనాభివృద్ధి సంస్థ రూ.57 లక్షల విలువైన ఐదు రకాల వరి విత్తనాలను విక్రయించింది. ప్రధానంగా సాంబమసూరి(బీపీటీ 5204) రకం విత్తనాలు అమ్ముడయ్యాయి. అంతేకాక అపరాల పంటలైన పెసర కంది, మినుము విత్తనాలను కూడా విత్తనాభివృద్ధి సంస్థ విక్రయించింది.

వ్యాపారంలో 97 శాతం రికవరీ

విత్తనాభివృద్ధి సంస్థ ప్రస్తుత వానాకాలంలో చేపట్టిన వ్యాపారంలో ఇప్పటికే 97 శాతం రికవరీ నమోదైంది. ఖమ్మం జిల్లాలో 75, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 20 పీఏసీఎస్‌లతో పాటు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ సంస్థ ద్వారా సంస్థ విత్తన వ్యాపారం నిర్వహించారు. ఆయా చోట్ల విత్తనాలు అమ్ముడవగానే నగదు రికవరీ చేశారు. సంస్థ ద్వారా 22,540 క్వింటళ్ల విత్తనాలను విక్రయించి రూ.8.53 కోట్ల వ్యాపారం చేయగా, ఇందులో ఇప్పటికే రూ.8.24 కోట్లు వెనక్కి వచ్చేశాయి. ఇంకా రూ.29 లక్షల మేర పీఏసీఎస్‌ల నుంచి వసూలు కావాల్సి ఉంది.

ప్రస్తుత సీజన్‌లో విత్తనాభివృద్ధి సంస్థ చేపట్టిన విత్తన విక్రయాలు

విత్తనం	క్వింటాళ్లు	విలువ
జీలుగ	18,702	రూ.6.95 కోట్లు
జనుము	2,186	రూ.79 లక్షలు
పిల్లి పెసర	171	రూ.9.28 లక్షలు
వరి-బీపీటీ 5204	978	రూ.40.95 లక్షలు
ఎంటీయూ 1061	376	రూ.14.86 లక్షలు
ఆర్ఎన్ఆర్	04	రూ.16 వేలు
కేఎన్ఎం-1638	4.50	రూ.18 వేలు
ఎంటీయూ-1010	17	రూ.68 వేలు
పెసర	86.40	రూ.10.34 లక్షలు
మినుము	8.64	రూ.1.12 లక్షలు
కంది	4.60	రూ.69 వేలు
మొత్తం	22,538.14	రూ.8,52,26,000

అందుబాటులో అవసరమైన విత్తనాలు



ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలను సాధ్యమైనంత మేర అందుబాటులో ఉంచాం. రైతులు సాగుకు ప్రాధాన్యత ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను సీజన్‌కు ముందుగానే సమకూర్చాం. 60 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలతో పాటు ఐదు రకాల వరి విత్తనాలను విక్రయించాం. ప్రధానంగా సహకార సంఘాల ద్వారా వ్యాపారం ఎక్కువగా సాగింది.

– ఎస్.బిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు రాందాస్, ఆదినారాయణ, పాయం, పక్కన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, విజయ్‌బాబు తదితరులు



సీఎం రేవంత్‌రెడ్డితో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి

సత్తుపల్లి/వైరా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను వివరించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. అలాగే, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కూడా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, పినపాక ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కాగా, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించడంపై మువ్వా విజయబాబు సైతం సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీల హడావుడి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ శాఖల్లో బదిలీల సందడి నెలకొంది. 2018లో చివరిసారి బదిలీలు జరగగా తాజాగా ప్రభుత్వం నిషేధం ఎత్తివేయడంతో అర్హులంతా అదే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. బదిలీ కోసం అర్హులైన ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చే గడువు శుక్రవారంతో ముగిసింది. దీంతో ఉద్యోగులు రాష్ట్ర, జోన్, మల్టీజోన్, జిల్లా స్థాయిల్లో ఆప్షన్లు పెట్టుకున్నారు. చివరి రోజు జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉద్యోగులు కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ కార్యాలయాల్లో దరఖాస్తుకు బారులుదీరారు. వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు 40 కేడర్లకు చెందిన 655 మంది బదిలీ అయ్యే అవకాశముందని తెలుస్తోంది. అయితే, శుక్రవారం సాయంత్రానికి 262దరఖాస్తులు అందినట్లు సమాచారం. ఇక వైద్య, విధాన పరిషత్‌లో సుమారు 1,180 పోస్టులు ఉండగా, మినిస్టీరియల్ స్టాఫ్ 60, ఫార్మామెడికల్ 125, నర్సింగ్ 546, వైద్యులు 449 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఎందరు దరఖాస్తు చేసుకున్నారో స్పష్టత రాలేదు. కాగా, ఇప్పటికే జిల్లాలో ఉద్యోగుల సీనియారిటీ, ఖాళీల జాబితాను ఉన్నతాధికారులకు పంపారు. ఒకేచోట రెండేళ్లు పనిచేసి ఉంటే బదిలీకి అర్హులని వెల్లడించగా, నాలుగేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగికి బదిలీ తప్పనిసరి చేయడంతో ఆందోళన చెందుతున్నారు. మరోపక్క 40 శాతానికి మించి ఉద్యోగులను బదిలీ చేయొద్దనే నిబంధన కారణంగా ఏయే కేడర్‌లో ఎందరు బదిలీ అవుతారోనన్న ఉత్కంఠ నెలకొంది. అయితే, వైద్య, ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ విభాగాల్లో చాలా మంది ఉద్యోగులు పదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నందున వీరిలో ఎందరు బదిలీ అవుతారో తేలాల్సి ఉంది.

ప్రాణం తీసిన ఫ్యాన్

- రెక్కలు తగిలి వ్యక్తి మృతి



జర్పుల శంకర్ మృతదేహం

కారేపల్లి: పూరిగుడిసెలో కిందకు ఉన్న ఫ్యాన్ రెక్కలు తాకడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం సూర్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జర్పల శంకర్(55) రైల్వే పని చేస్తుంటాడు. సూర్యతండాలో పూరిగుడిసెలో నివాసముంటుండగా, ఆయన భార్య కుమార్తె వద్దకు వెళ్లింది. శుక్రవారం పనికి వెళ్లొచ్చిన శంకర్ ఫ్యాన్ వేసి నిద్రించేందుకు ఉపక్రమిస్తుండగా ప్రమాదవశాత్తు ఫ్యాన్ రెక్కలు మెడకు తగలడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆ సమయాన ఫ్యాన్ శబ్దం పెద్దగా రావడంతో గుర్తించిన స్థానికులు వచ్చేసరికి శంకర్ మెడకు గాయాలై మృతి చెంది ఉన్నాడు. ఘటనపై ఆయన భార్య ఈరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం తెలిపారు.

కొత్త చట్టాల అమలుతో న్యాయ సంక్షోభం

'మాస్‌లైన్' సెమినార్‌లో ప్రొఫెసర్ మురళి



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త చట్టాల వల్ల దేశంలో న్యాయ సంక్షోభం తలెత్తడమే కాక పౌర, ప్రజాస్వామిక హక్కులు అణచివేయబడతాయని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ కర్ణం తెలిపారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీ సభ్యులను సస్పెండ్ చేసి చట్టాలను ఆమోదించారని, వీటిపై సమగ్రమైన చర్చ లేకుండా అమలు చేస్తుండడం అనేక అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. నేరాలకు సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణమవుతాయనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని న్యాయమూర్తులకు విచక్షణ అధికారాన్ని గత చట్టాలు కట్టబెడితే, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా చేశారని తెలిపారు. పాలనలో కఠినమైన నిర్ణయాలు తీసుకునే ఉద్దేశం కేంద్రానికి ఉండడంతోనే ఇలాంటివి ప్రవేశపెట్టారని అన్నారు. జీవించే హక్కు, పౌర స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కొన్ని సెక్షన్లను కఠినతరం చేశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, వి.కృష్ణమూర్తి, కె.రవి, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఓరుగంటి శేషగిరి, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, పావెల్, శిరీష మాట్లాడగా నాయకులు కొల్లేటి నాగేశ్వరరావు, మంగతాయి, శోభ, కె.శ్రీను, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటకపోతే ఇదే పరిస్థితి..



ఆక్సీజన్ మాస్క్ ధరించి మొక్కలు అందజేస్తున్న కేడెట్లు

సత్తుపల్లిటౌన్: మొక్కలే మనిషి ప్రాణాధారమని.. మొక్కలు నాటకపోతే వాతావరణ సమతుల్యత దెబ్బతిని ఇబ్బంది పడాల్సి వస్తుందని ఎన్‌సీసీ కేడెట్లు ప్రచారం నిర్వహించారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు శుక్రవారం వాహనదారులు, స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేడెట్లు ఆక్సీజన్ మాస్కులు ధరించి మొక్కల నాటకపోతే ఎదురయ్యే అనర్థాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, ఎకో క్లబ్ కన్వీనర్ వీరన్న, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రామచంద్రరావు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ రవికుమార్, డాక్టర్ సారంగపాణి, మధు, కేడెట్లు పాల్గొన్నారు.

చెరువులను మింగేస్తున్నారు..

- శిఖం భూములు యథేచ్ఛగా ఆక్రమణ
- జాయింట్ సర్వే చేస్తేనే వెల్లడి కానున్న అసలు స్వరూపం



ఆక్రమణకు గురవుతున్న సదాశివునిపేటలోని నల్లచెరువు

సత్తుపల్లి: చెరువు శిఖం భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. కొందరు అక్రమార్కు తీరుతో చెరువులు నానాటికీ కుచించుకుపోయి అసలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. ఇందులో భాగంగానే సత్తుపల్లి మండలం సదాశివునిపేటలోని నల్లచెరువు, తుమ్మల చెరువు, ఊరచెరువులు ఆక్రమణలకు నిలయంగా మారాయి. గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల పూడికతీత సమయాన ట్రెంచ్ కొట్టినా పూడ్చివేసి మరీ ఆక్రమించుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్ లెవల్‌లో ఆక్రమణలు పెరగడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోగా... కొందరు అక్రమార్కుల తీరుతో వరద పోటెత్తి సమీపంలోని తమ పొలాలను ముంచెత్తుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు చెరువులదీ అదే పరిస్థితి

సదాశివునిపేటలోని నల్లచెరువు 79 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సి ఉండగా ఇప్పుడు 20 నుంచి 30 ఎకరాలకు కుచించుకుపోయింది. ఇక ఊరచెరువు 32 ఎకరాల నుంచి 23 ఎకరాలకు, తుమ్మలచెరువు 13.09 ఎకరాల నుంచి పదెకరాలకు చేరింది. ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురికావటంతో వర్షాకాలంలో చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి కానరావడం లేదు. కొందరు తమకు పట్టాలు ఉన్నాయంటూ ఆక్రమణలకు తెగబడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోపక్క ఎఫ్‌టీఎల్ లెవల్‌లోని భూముల్లో పంటలు సాగుచేయవద్దని అధికారులు చెబుతున్నా ఆక్రమణదారులు పట్టించుకోవడం లేదు. కాగా, సదాశివునిపేట సర్వే నంబరు 103లో 19 ఎకరాలకు ఇరిగేషన్ శాఖ, రైతుల మధ్య వివాదం నెలకొంది. ఇందులో ముంపు 12 ఎకరాలు ఉండగా ఆరు ఎకరాలకు పట్టా ఉందని తెలుస్తోంది.

ఉమ్మడిగా సర్వేచేస్తేనే..

చెరువు భూముల్లో ఆక్రమణలు తొలగించాలంటే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ సంయుక్త సర్వేతోనే సాధ్యమవుతుందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు ఆక్రమణలు తొలగిస్తున్నామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ-1లో ట్రెంచ్ కొట్టించగా.. మిషన్ కాకతీయ-2, 3లో ట్రెంచ్‌కు బదులు మార్కింగ్ చేశామని తెలిపారు. ముంపు పట్టాలు ఉన్నచోట కొందరు రైతులు వ్యవసాయం చేస్తున్నారని, మరికొన్ని ప్రాంతాలకు సంబంధించి కేసులు నడుస్తున్నాయని చెప్పారు. అసలు పట్టా లేకుండా వ్యవసాయం చేస్తేనే ఆక్రమణ కిందకు వస్తుందని, ఈ అంశంపై జాయింట్ సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగిస్తామని డీఈఈ వెల్లడించారు.

విద్యార్థిని ఆత్మహత్య

సుజాతనగర్: పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో శుక్రవారం ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. కొత్తగూడెం టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామానికి చెందిన బుర్రా లిడియా(12) పాల్వంచ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. 10 రోజుల క్రితం బాలిక పాఠశాలకు వెళ్లగా జ్వరం వచ్చింది. దీంతో ఇంటికి వచ్చిన బాలికను జ్వరం తగ్గిన అనంతరం పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేని బాలిక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అయోధ్యలో రామయ్య దర్శనానికి..



అయోధ్య వెళ్తున్న కామేపల్లి వాసులు

కామేపల్లి: కామేపల్లికి చెందిన హరిజనవాడసులు 100మంది శుక్రవారం అయోధ్య బయలుదేరారు. శ్రీరామనవమి భక్త మండలి ఆధ్వర్యాన కాలనీవాసులు అయోధ్యలో బాలరాముడి దర్శనంతో పాటు వారణాసి, కాశీ తదితర పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. వ్యవసాయ పనులు ముమ్మరం కాకముందే పుణ్యక్షేత్రాలకు వెళ్లి రావాలనే భావనతో కాలనీలోని చిన్నాపెద్ద బయలుదేరగా, భక్త మండలి సభ్యులు కామా వెంకటేశ్వర్లు, కన్నమాల రాంబాబు, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, భిక్షం, మధు, రమేష్, నాగేష్, మంచాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ట్రావెల్స్ బస్సు



డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లిన బస్సు

కూసుమంచి: ఏపీ నుండి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గురువారం అర్ధరాత్రి ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచిమండలం నాయకన్‌గూడెం వద్ద అదుపు తప్పింది. బస్సు టైరు ఒక్కసారిగా పేలడంతో అదుపు తప్పగా డ్రైవర్ చాకచక్యంగా అదుపు చేశాడు. అప్పటికే బస్సు డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లింది. ఈసమయాన బస్సులో 35మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ శబ్దం విన్న హైవే సిబ్బంది సంఘటనా చేరుకుని ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు.

అనుగ్రహం ఉంటే అర్హత ఎందుకు?

- కేఎంసీలో ఇష్టానుసారంగా ఇన్‌చార్జి బాధ్యతలు
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు కనీస అర్హతలు లేకున్నా పదోన్నతలు, ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీనిఫలితంగా క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం పడుతోంది. అర్హత లేకున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల అనుగ్రహం ఉంటే పలువురికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించి కార్మికులపై పెత్తనం చేసే అధికారం కట్టబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేఎంసీలో ఏడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఉండగా ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఒకరు రెగ్యులర్ ఉద్యోగి కాగా.. మరో నలుగురు పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ హోదా ఉద్యోగులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. కాగా, నాలుగు నెలల క్రితం ఓ పీహెచ్ వర్కర్‌కు పెద్దల అండదండలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారని, ఈ సమయాన డబ్బు చేతులు మారిందనే చర్చ జరుగుతోంది. అయితే, అధికారులు ప్రేమతో ఏర్పాటు చేసుకున్న ఆయన ఇప్పుడు కేఎంసీలో ఇతర శానిటరీ ఇన్‌స్పెక్టర్లను శాసించే స్థాయికి చేరాడని.. కార్మికులు, కార్యాలయ సిబ్బందిని నియంత్రించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడనే ప్రచారం మొదలైంది. సాయంత్రమైతే చాలు సదరు శానిటనీ ఇన్‌స్పెక్టర్ అధికారి గది వద్దే ఉండి ఇతర సిబ్బంది వెళ్లకుండా అడ్డుకుంటూ సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక రమణగుట్టలోని ఓ డివిజన్‌లో కార్మికులు హాజరు తక్కువగా నమోదైందనే కారణంతో అక్కడ పని చేస్తున్న జవాన్‌ను తొలగించి ఇంకో కార్మికుడికి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారి కోసం పనిచేస్తున్న వారిని పక్కన పెడుతుండడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.